


# సర్వశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్వశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**సూరత్..(గుజరాత్)** తపతీనది చల్లగా ప్రవహిస్తోంది. దూరంగా.. దూరదూరంగా అనేకానేక పశువులు నది ఒడ్డున చచ్చిపడివున్నాయి. ఇనుపముక్కు గద్దలు వాటిని పీక్కుతింటున్నాయి. కాకులు, ఇతర పక్షుల మాట సరేసరి.

పొద్దున్నే పశుపాలకులు వాటిని తపతీనదీ తీరానికి తోలుకుపోతారు. నదీ తీరాన వున్న చిన్న చిట్టడవీ, మైదానంలో దొరికే గడ్డి మహాబలవర్ధకమైనది. పశువుల్ని వాటి మానాన వదిలి పశుపాలకులు హాయిగా నదిలో యీతలు కొడతారు. తపతీనది మహారాష్ట్ర గుజరాత్ మధ్య ప్రదేశ్‌లను సస్యశ్యామలం చేస్తూ అరేబియా సముద్రంలో కలుస్తూంది. నర్మదానదికి దక్షిణాన ఉన్నదే తపతి. దాదాపు 722 కిలోమీటర్ల పొడుగు వుంటుంది. దీన్నే 'తపి' అని కూడా పిలుస్తారు.

ఆడుకునే పిల్లలెవరూ లేరు. నది విషపూరితం కాలేదు. ఎక్కడినించో ఇనుమముక్కల గద్దలొచ్చాయి. పశువుల్ని పొడిచి పొడిచి కండలు పీకాయి. క్షణాల్లో పశువులు విగత జీవులయ్యాయి. పశుపాలకులకి భయం వేసింది. యజమానులు దయాపరులు కారు. ఏం చెయ్యాలో తెలీక బిక్క మొహం వేస్తే, రఘునందన్ బిర్జూ అనే పిల్లవాడు లేచి, "మనం కనీసం రెండు రోజులు పాటు ఎవరికంటా పడకుండా దాక్కుందాం. పశువుల మరణం యజమానులకి తెలిసినా, మనం ఎక్కడున్నామో తెలీక వాళ్ళు కంగారు పడతారు. కొంతలో కొంత కోపం తగ్గుతుంది. ఈలోగా మరణించిన

పశువులు మామూలుగా మరణించలేదన్న విషయమూ బైటికొస్తుంది. ఆ తరువాత మనం ఏదో కథ చెప్పి వెనక్కి రావొచ్చు. ప్రస్తుతానికి ఇదే మనకున్న ఏకైక ఉపాయం" అన్నాడు.

"తప్పు బిడ్డా పశువుల్ని వాటి మానాన వదిలి మనం ఈతల్లోనూ ఆటపాటల్లోనూ గడపటం తప్పు. జరిగిన విషయాన్ని వెంటనే యజమానులకి తెలియచెప్పకపోవడం రెండో తప్పు. కట్టుకథ చెప్పబోవడం మూడో తప్పు. సమస్య చాలా తీవ్రమైనది. అందరం వెనక్కి వెళ్ళి మన మన యజమానులకి నిజం చెబుదాం. ఒకరిమాట కైతే విలువుండదు. అందరం ఒకేసారి నిజం చెప్పడం వల్ల, యీ విపరీత సంఘటనకి మూల కారణం కూడా పట్టుకోవడానికి పెద్దలకు వీలవుతుంది" అందరివంకా చూసి సిన్సియర్‌గా చెప్పాడు రఘునందన్ కంటే ఓ పదేళ్ళు పెద్దవాడైన సమతుల్ నిగమ్. పశువుల కాపర్లు ఆలోచనలో పడ్డారు. కొందరికి రఘునందన్ మాట నచ్చితే కొందరికి సమతుల్ మాట నచ్చింది. అయితే ఎటూ తేల్చుకోలేకపోతున్న దశలో అందరికంటే పెద్దవాడైన సనాతన్ యాదవ్ లేచినిలబడి, "అందరికీ నా విన్నపం ఏమంటే, ఆలోచనలు పక్కనబెట్టి సమతుల్ మాటని పాటిద్దాం. ఎందుకంటే, పశువుల మృత్యువు సంగతి వాటి యజమానులకి చెప్పకుండా పారిపోవడం క్షమార్హమైన తప్పుకాదు. మరోటి, మనం ఎక్కడికో కొన్నిరోజులు పాటు పారిపోతే మన కుటుంబ సభ్యులు ఎంత బాధపడతారూ? మనం కూడా మృతులయ్యామనే నిర్ణయానికొస్తే, పరిస్థితి దుర్భరం అవుతుంది. కొందరి ప్రాణాలు ఆ దెబ్బతో ఎగిరిపోనూ వచ్చు. కనుక మంచో చెడో తిరిగి వెనక్కి వెడదాం. నిజాన్ని నిర్భయంగా చెబుదాం" అన్నాడు.

అందరూ మౌనంగా తలలు ఊపారు. ఒక్క రఘునందనే బిర్జూ మాత్రం 'నేను రాను. మీరు వెళ్ళండి. ఏడిచేందుకూ, చచ్చేందుకూ నాకు కుటుంబం అంటూ ఏదీలేదు మీలాగా. అదీకాక నా యజమాని పరమ కర్కోటకుడు. ముందు నన్ను చంపేస్తాడు" అని అడవి దిక్కువైపు సాగిపోయాడు.

ఆ విషయాలు నిజమే గనక ఎవ్వరూ ఏమీ మాట్లాడలా. సనాతన్ ఆపడానికి ప్రయత్నించినా బిర్జూ తల అడ్డంగా తిప్పి అడవి వైపుకి వెళ్ళిపోయాడు.

దాదాపు నూటయాభై బలిష్టమైన పశువులు. అన్నీ పాలిచ్చేవే. అదీ లీటర్లకి లీటర్లు. విచార వదనాలతో అందరూ సూరత్ సమీపాన వున్న 'ధన్‌వా' గ్రామానికి పయనమయ్యారు. ధన్‌వా గ్రామం పేరుకే గ్రామం. ఎందుకంటే అది చాలామటుకూ సూరత్‌లో పనిచేసే ఉద్యోగులతోనే నిండిపోయింది. సూరత్ అద్దెలు భరించలేని ఉద్యోగులకు 'ధన్‌వా' నిక్షేపంలాంటిది. కొందరు ఉద్యోగులైతే ఏకంగా స్థలాలు కొనుక్కుని ఇళ్ళు కూడా కట్టుకున్నారు. దాదాపు గంట తరవాత ధన్‌వా పశువుల మృతి వార్తతో అట్టుడికిపోయింది. కేవలం సనాతన్, సమతుల్ వాళ్ళ పశువులే కాదు. చుట్టుపక్కల గ్రామాల పశువులు కూడా ఇదేవిధంగా మృత్యువాతపడ్డాయని ఆయాగ్రామాల పశువులు కాపర్లు కూడా ఒకే రకమైన వార్త తెచ్చారు. పత్రికవిలేఖరులు రకరకాల ఊహాత్మక, వ్యూహాత్మక విశ్లేషణలతో పండగ చేసుకున్నారు. ఏ ఇంట్లో, ఏ

కూడలిలో, ఏ కార్యాలయాములో చూసినా ఇదే చర్చ. "కలియుగాంతం రాబోతుందనడానికి ఇదే తొలి నిదర్శనం" అన్నారు ఓ కంప్యూటర్ బాబాజీ.

"ఇది మామూలుగా జరిగింది కాదు. ఇది ఖచ్చితంగా ప్రతిపక్షాల కుట్ర. మా ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రతిపక్షాలు రచించిన హీనాతి హీనచర్య" అని ఓ మంత్రిగారు మహావేశంతో మండిపడ్డారు.

"మంత్రిగారు తమ ప్రభుత్వ వైఫల్యాలని కప్పి పుచ్చుకోవడం కోసం ఇటువంటి అవాస్తవ, అసంబద్ధ ఆరోపణలు చేస్తూ సత్యాన్ని వక్రీకరిస్తున్నారు. CBIతో ఇన్వెస్టిగేషన్ జరిపి నిజాన్ని నిగ్గు తియ్యాలి" అని ప్రతిపక్ష నాయకుడు కూడా తొడగొట్టి మరీ చెప్పాడు.

"అయ్యా..ప్రభుత్వ – ప్రతిపక్ష నాయకులు వాగ్వాదాలు మాని దీని వెనకనున్న నిజాన్ని వెలికి తీసే ప్రయత్నం చెయ్యాలి. దీని వెనుక పరదేశపు హస్తం ఉన్నదా, పరమతవాదుల హస్తం వున్నదో వీలున్నంత త్వరగా పరిశోధించాలి" అన్నాడు ఏ పదవిలోనూ, పార్టీలోను ప్రస్తుతం లేని వృద్ధ నాయకుడు. ఆయన ఎన్నిసార్లు పార్టీలు మార్చాడంటే, ఏ పార్టీలో వున్నాడో ఆయనకే గుర్తులేనంత. అందుకే ఏ పార్టీ ఆయన్ని చేర్చుకోలేదు.

"ఇది గోవధ అంశం. క్షమార్హమైనది కాదు. మనమంతా సంఘటితంగా లేనందునే ఇటువంటి ఘోరకృత్యాలకి కొందరు దుష్టులు ఒడిగడుతున్నారు. సోదరులారా, మనందరం అన్ని తేడాలను మరచి సంఘటితమవాల్సిన సమయం ఇదే, లేకపోతే మన మాతృభూమే మనకి పరాయిదవుతుంది." అత్యంత తీవ్ర పదజాలంతో జనాన్ని ఐక్యపరిచే ఉపన్యాసం ఇచ్చాడో శ్వేతాంబరధారి. ప్రాణ భయంతో పారిపోదామనుకున్న పశువుల కాపర్లు మాత్రం, సుదీర్ఘంగా నిట్టూర్చారు.

'దె సిటీ అబ్జర్వర్' ఎడిటర్ సచేత దద్లాని చాలా తెలివైనవాడు మాత్రమే కాదు, నిగూఢమైన వాడు. వార్త వినగానే అది యధాతధంగా పత్రికలో ప్రచురించి గమ్మున వూరుకోలేదు. బొంబే, పుణే, ఢిల్లీ , మీరట్, బకరీన్ అహమ్మదాబాద్ మద్రాస్, బెంగుళూర్, త్రివేంద్రం మొదలైన నగరాలకూ యీ వార్తని పంపి అటువంటి విశేషాలుంటే తనకు సమాచారం ఇవ్వమని రిక్వెస్టు చేయడమేగాక, ధనవా గ్రామానికీ ఇతర గ్రామానికీ తన మనుషుల్ని పంపాడు. ఆ మనుషులందరూ యువకులు. పత్రికా విలేఖరులుగా తర్ఫీదు పొందినవారు.వార్తా సేకరణకి ప్రాణాలైనా ధారపోసే ధైర్యవంతులు.

24గంటలు గడిచేలోగా సమాచారం లభించింది. పైన పేర్కొన్న నగరాలలో మాత్రమేకాక కొన్ని వందల గ్రామాల్లో పట్టణాల్లో ఇటువంటి సంఘటనలే జరిగినాయని. జాతీయ పత్రికలన్నీ యీవార్తలని ప్రముఖంగా ప్రకటించమేకాక ప్రభుత్వానికి సంఘటనల తీవ్రతని తెలియజేశాయి. ఓ పక్క రక్షణశాక, మరోపక్క హోంశాఖ తమతమ అధికారుల్ని రంగంలో దింపి విచారణ మొదలుపెట్టాయి.

"సార్, ఇది మతకలహాలకోసమో, తీవ్రవాద సంస్థలు తమ ఉనికిని చాటుకోవడం కోసమో చేసిన వ్యవహారం కాదు. ఆ పశువుల్ని తిన్న పక్షులు మహోద్రంగా చెలరేగుతున్నాయి. కళేబరాన్ని ముట్టుకున్న కుక్కలు రక్తపిపాసులుగా

మారుతున్నై. దారికెవరు ఎదురొచ్చినా కండలుగా కొరికి రక్తం పీల్చుతున్నాయి. అంతేకాదు వాటి చొంగ పడిన చోటల్లా ఎర్రగా రక్తంలా కనిపించడంతో చీమలు ముసురుకుంటున్నాయి. ఆ చీమలు కూడా ఇతర జీవుల్నీ మనుషుల్నేకాక మొక్కలనీ, కూరపాదుల్నీ కూడా విడవకుండా కుడుతున్నాయి. దానివల్ల ఆ కూర పాదుల్లోనూ, మొక్కల్లోనూ విపరీతమైన మార్పులు కనబడుతున్నాయి. ఇవన్నీ సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశోధిస్తే లభించిన పచ్చి నిజాలు" అన్నాడు అభిజీత్ ఆచార్య. అతను సచేత దద్లానీకి రైట్ హాండ్. సచేత్ దద్లానీ సైలెంటైపోయాడు. అభిజీత్ ఇన్ఫర్మేషనేకాదు. ఇతరులు పంపిన ఇన్ఫర్మేషన్ ఇంకా ఘోరంగా ఉంది. క్రిమి కీటకాల్ని తిన్న కోళ్ళు చాలా వైల్డ్‌గా ప్రవర్తిస్తూన్నాయట. వాటిని తిన్న మనుషుల్లోనూ, వారి స్వభావాల్లోనూ చాలా విపరీతమైన మార్పులొస్తున్నాయట. పరమ శాంత స్వరూపులు కూడా అటువంటి కోడి మాంసాన్ని తిన్నాక విపరీత ప్రకృతులైపోతున్నారట.

గాలీ నీరూ కూడా కలుషితమైతే? అసలు ఆ విషపూరితమో ఉద్రేక కారణమో అయిన కూరగాయలు తిన్నవాళ్ళ పరిస్థితి ఏమిటీ? సచేత్ దద్లాని వణికిపోయాడు.

"ఇది ఓ రాష్ట్రానికీ దేశానికీ సంబంధించిన సమస్యకాదు అభిజీత్. ప్రపంచాన్ని అతిత్వరలోనే పట్టి పీడించబోయే భయంకరమైన సమస్య. ఈ లక్షణాలు గర్భస్థ శిశువులకి సోకితే? పుట్టేవాళ్ళ మనస్థితి ఎలా వుంటుందో ఊహించడానికి కూడా శక్యం కాదు. "సచేద్ మాటల్లో కంగారు, భయం, బాధ, నిస్సహాయత ఒకేసారి తొంగిచూశాం.

"చిత్రం ఏమంటే, శాఖహార జంతువులు కూడా పశువుల్నీ కోళ్ళనీ పీక్కుతినడం. ఇదెలా సాధ్యమైందీ?" తనలో తను అనుకున్నట్టుగా పైకే అన్నాడు దద్లాని.

రెండవరోజు కేంద్ర ప్రభుత్వం మాంసాహారం తినడం తక్షణం ఆపేయాలని ప్రకటించింది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రెండూ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ సమీక్షిస్తున్నాయనీ, అతి త్వరలో పరిష్కార మార్గం కనుక్కునే చర్యలు చేపడుతున్నాయనీ మరో ప్రకటన వెలువడింది. పరిశోధనలా నత్త నడక నడుస్తుంటే, సమస్యమాత్రం కార్చిచ్చులా వ్యాపిస్తోంది. మృతి చెందిన పశువుల, గొర్రెల, మేకల, కోళ్ళు సంఖ్య భయం గొలిపేలా ఉంది. అన్నిటి వెనకా కనిపించే ఒకే కారణం ఇనుపముక్కు గద్దలు. అవి ఎక్కడ్నించి వచ్చాయోగానీ అన్ని నగరాల్లోనూ తమ ప్రతాపం చూపించి మటుమాయమయ్యాయి. వాటి ఉనికిపట్టడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదల్యాయి. మార్క్.ఏ. బట్లర్ అనే నిపుణుడు అన్నాడు "అతి సహజంగా పుట్టినవికావు. అంతవరకూ ఖచ్చితంగా చెప్పగలను" అని.

ఆట మొదలైంది. యాభై పేపర్లు స్టిట్సన్, రజోవ్‌స్కీల ముందు పడేసి అన్నాడు గోర్కీ.

"ఏమయింది?" సీరియస్‌గా అడిగడు స్టిట్సన్. పత్రికల్లోని వార్తలు కూలంకషంగా వినిపించాడు గోర్కీ. ఉగ్గబట్టుకుని విన్నారు స్టిట్సన్, రజోవ్‌స్కీ.

"సో.. దీనికీ, మన ప్రాజక్ట్‌కీ సంబంధం ఉందంటావా?" సిగరెట్ వెలిగించకుండా అన్నాడు రజోవ్‌స్కీ.

"సిగరెట్టూ అగ్గిపెట్టె రెండు సిద్దంగానే ఉన్నై రజోవ్‌స్కీ.

"సిగరెట్టూ అగ్గిపెట్టె రెండూ సిద్దంగానే ఉన్నై రజోవ్‌స్కీ వెలిగించడం ఒకటే మిగిలింది. ఇనుపముక్కు గద్దల ద్వారా యీ ప్రభంజనం, అంటే మృత్యు ప్రభంజనం మొదలైంది. ఇప్పుడు కొందరు దీనికి కారణం 'తామే' అనీ, తమ షరతులకు ఒప్పుకోకపోతే విధ్వంసం ఇంకా పెరుగుతుందనే హెచ్చరిస్తారు. వారి గొంతెమ్మ కోరికలు తీర్చుకునే విషయంలో యీ వ్యవహారం ఓ ట్రంప్‌కార్డు అవుతుంది. భారతదేశం కఠిన పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది" అన్నాడు గోర్కీ.

"ఇది అక్కడితో ఆగదుగా. భారతదేశంతో ఆగిపోదుగా. నీటితో, గాలితో పయనించి అన్ని దేశాల మనుగడకు ప్రమాదకారిగా మారుతుంది. ఫ్రెండ్, అవకాశం కోసం డెస్పరేట్‌గా ఎదురు చూసే కట్లపాము కాటు వెయ్యడానికే తహతహలాడుతుంది గానీ ఆ అతరవాత తన ప్రాణానికే ముప్పు అని ఆలోచిస్తుందా? ఈ ఘోర పరిస్థితిని ఎవరు సృష్టించినా, ఆలోచించి మాత్రం చెయ్యలేదు. సృష్టించిన వాడే దీనికి బలికాక తప్పదు. అది వేరే విషయం. అసలు దీని గురించిన సమాచారం సేకరించడం ముందు ముఖ్యం. తరవాత ఇది మానవ సృష్టా లేక ఏదైనా ప్రయోగ వైఫల్య కారణమా అని ఆలోచించి ధృవీకరించుకోవాలి. ఆ తరవాత యీ విపత్తుని ఎలా ఎదుర్కోవాలో చర్చించుకుని ఒక ప్రణాళికను మనం రూపొందించుకోవాలి" ఇద్దరివంకా చూస్తూ చెప్పాడు గోర్కీ. వారిద్దరూ గోర్కీ ముఖంలోని ఆందోళన గమనించారు. కానీ, అది బయటికి కనిపించినట్లు ప్రవర్తించలేదు.

"ఏం .. మీ దేశాలనించి ఇటువంటి సమాచారం ఏదైనా మీకు వచ్చిందా? క్యూరియస్‌గా అడిగాడు గోర్కీ.

"మిస్టర్ గోర్కీ మాకు వచ్చిన సమాచారం నిర్ధుష్టమూ, స్పష్టమూ అయినది కాదు. పుకార్ల మాదిరి సమాచారం వచ్చింది. అవి నిరాధారమైనవి. అందుకే నీకు చెప్పలేదు. సూక్ష్మంగా చెబితే మీరు చెప్పిన వార్తలే. కానీ మరో యాంగిల్‌లో వచ్చాయి. మిస్టర్ గోర్కీ అండ్ మిస్టర్ స్తిట్సన్.. రష్యన్ దేశపు సంస్కృతీ, జీవిత విధానమూ, ఇవన్నీ మీకు తెలుసు. ఒకప్పటి అఖండ రష్యా వేరు. అంటే అఖండ USSR. ఇప్పటి రష్యా వేరు. అజర్ బైజాన్ లో , ఉక్రెయిన్ లో ఇలా ఎన్నో రాష్ట్రాలు విడిపోయాయి. ఒక్క 'కాక్‌సస్' పర్వత శ్రేణుల చాటుమాటున, పర్వతపు ఒడిలో, చుట్టుపక్కల వున్న గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ నెలకొని వుండే సంస్కృతి వేరు. అక్కడి మూఢ నమ్మకాలు వేరు. అక్కడి బలులు వేరు. అక్కడి క్షుద్రపూజలు వేరు. ఆ పద్దతులు ఏనాడూ వెలుగు చూడవు. మీ హిందూ దేశపు చేతబడుల్లానే, యూరప్, ఇతర ఖండాల బ్లాక్ మేజిక్ లాగానో, రష్యన్ పద్దతులూ కొన్ని ఉన్నై. వాటిని నమ్మాలా అంటే నమ్మాలి. లేదా అంటే లేదు. నాకు పదేళ్ళ వయసులో ఓ అడవి పందిని బలి ఇవ్వడం చూశా. తల నరికేసిన తరవాత కూడా దాదాపు దాని శరీరం ఓ మైలు దూరం పరిగెత్తింది. అది తలవున్న పందిలాగే. మధ్యలో ఉన్న గోతుల మీదనించి ఎగిరి దూకుతూ, ముళ్ళపొదలనించి దారి మళ్ళుతూ. ఇది నాకళ్ళతో చూసింది. అలా ఎలా పరిగెత్తిందీ అని మా తాతని అడిగితే, "దాని తల నరికేప్పుడు కొన్ని

మంత్రాలులాంటి దైవ వాక్యాలని దాని చెవిలో చెబుతాం. ఆ వాక్య మహిమ ఎంతటిదంటే, దానికి తలలేకపోయినా, శరీరంలోని 'శక్తి' చివరి బిందువు లేక అణువు వరకూ, దానికి అన్నీ కనిపిస్తాయి వినిపిస్తాయి" అని. దీనికి మీరు శాస్త్రబద్ధమైన వివరణ కావాలంటే, నేనెక్కడనించి తెచ్చి ఇవ్వనూ? అజర్‌బైజూన్‌లో వున్న ఓ ముస్లిం మతాధిపతి ఇది ఒక మహా శక్తిని లోబరుచుకున్నవాడు చేసిన మహా ప్రయోగం. దీన్ని అణచాలంటే అంత శక్తిమంతుడి వల్ల మాత్రమే సాధ్యమవుతుంది" అని.

మాటలు ఆపి వారివంక చూశాడు రజోవ్‌స్కీ.

"మైగాడ్.. నీ కళ్ళతో నువ్వు చూశావా?" ఆశ్చర్యంగా అన్నాడు స్టిట్సన్.

"యస్.. నా కళ్ళతో నేనే చూశా. అదేకాదు. ఇంకా చాలా. కొన్ని మంత్రవాక్యాలు పఠించి ఒకని పొట్టలో మంత్రవేత్త కత్తిని పూర్తిగా గుచ్చాడు. ఒక్క చుక్క రక్తం కారలేదు. అది ఇంద్రజాలపు కత్తిలాంటిదే అని అన్నాడు. అతనా కత్తిని పొట్టలోంచి తీసి నా చేతికి యిచ్చి , 'ఇది ఇంద్రజాలపు దా' అని  నవ్వాడు. ఫ్రెండ్స్, 18 సంవత్సరాల వయసులో యీ సంఘటన జరిగింది. పాతికసార్లు ఆ కత్తిని పరీక్షించి చూశా. అప్పుడా మంత్రవేత్త అన్నాడు, "మీకు సందేహం ఎందుకూ? ఆ కత్తి ఖరీదు కేవలం ఒకటిన్నర రూబుళ్ళు. ఆ డబ్బు ఇచ్చి ఆ కత్తిని మీరే తీసుకోండి" అన్నాడు. ఇప్పటికీ ఆ కత్తి నా దగ్గర ఉంది" అన్నాడు రజోవ్‌స్కీ.

"ఓహ్.. ఇండియా మాత్రమే కాదు. మీ రష్యాకూడా మిస్టిక్ లాండే" అన్నాడు స్టిట్సన్.

"యూరప్ కాదా? మిడిల్ యీస్ట్ కాదా? నిజం చెబితే ఏ దేశం మిస్టిక్ లాండ్ కాదూ? మిస్టర్ స్టిట్సన్, రష్యా కంటే మీ దేశాల్లోనే ఇటువంటి శక్తి ప్రయోగాలు ఎక్కువ వున్నై. ఇంకో విషయం మరిచిపోకండి, రెడ్ ఇండియన్స్‌లోనూ, చైనీస్‌లోనూ ఉన్న నిగూఢ రహస్యాలు సృష్టిలో ఎవరి వద్ద వుంటాయి?" అన్నాడు రాజోవ్‌స్కీ.

"ఏ దేశంలో జరిగినా, ఏ మతం వారు జరిపినా, జరగబోయే నష్టం మానవాళికే. పద్మ వ్యూహంలో అడుగుపెట్టడం తేలికే. ఎందుకంటే, పద్మవ్యూహం రచించిన వాళ్ళు కోరుకునేది శతృవులు అతి సులభంగా లోపలికి ప్రవేశించాలనే. కానీ మిత్రులారా, బయటపడటం అనేది దుస్సాధ్యం. ఇప్పుడు రచించబడ్డ యీ వ్యూహమూ ఓ పద్మ వ్యూహంలాంటిదే. అయితే ఇది మంత్ర పూరితమైనదా, రసాయన పూరితమైనదా, మనసులను, అంటే జీవరాశుల మనసులను లొంగదీసుకుని, జీవుల్ని పావుల్లా వాడుకునే తంత్రమా – ఇదీ మనం తేల్చుకోవలసిన అతి ముఖ్య విషయం" స్పష్టంగా అన్నాడు గోర్కీ.

"అదెలా తేలుతుందీ?" అడిగాడు స్టిప్సన్.

"నల్లమల అడవుల్లోని శిధిలాలయ ప్రాంగణంలో ఓ విశ్వశాంతి యాగం జరిగిందన్న విషయం ఇప్పటికే మీకు తెలుసు. ఒక భీభత్సమైన వర్షంలో ఓ మహోగ్ర శబ్దంతో ఏదో రాతిపొర పగిలి మెరిసే రాళ్ళను విరజిమ్మిందనీ మీకు

తెలుసు. ఆ యజ్ఞాన్ని నిర్వర్తించిన వారు అక్కడే వున్నారు. అంటే ఇంకా జరగాల్సిందీ, జరిపించాల్సిందీ ఏదో ఉందన్నమాట. మీ ప్రశ్నకి బహుశా అక్కడ సమాధానం లభించవచ్చు" ముక్తసరిగా అన్నాడు గోర్కీ. వారిద్దరూ ఒక ముఖ్యమైన విషయాన్ని తన దగ్గర దాచే ప్రయత్నం చేస్తున్నారని అతనికి అర్థమైపోయింది. అయినా బయటపడలా.

"అవును. అటువైపు మా ఆలోచన వెళ్ళలా. దైవ ప్రేరితమైనా మంత్రప్రేరితమైనా అక్కడినించే ఓ ప్రతిఘటన జరగాలి. ఆ విషయాల్లో పాశ్చాత్యులకంటే మీ దేశం లక్ష సంవత్సరాలు ముందుంది. శబ్ద శాస్త్రంలో మీ దేశాన్ని మించిన దేశం లేదు – రాదు" అన్నాడు గోర్కీ. కాసేపు మౌనం నర్తించింది.

"ఎడ్వర్డ్ ఏమైనా సమాచారం పంపాడా?" అడిగాడు గోర్కీ ఆ ఇద్దరినీ మార్చి మార్చి చూసి.

"లేదు. సమాచారం బహుశా అతని దగ్గర ఏదీ  లేదేమో?" కేజువల్‌గా అన్నాడు స్టీట్సన్.

"అదే అయివుంటుంది. చర్చించడానికి ఏదీ లేకుండా ఎలా వస్తాడు?" వంతు పలికాడు రజోవ్‌స్కీ.

వాళ్ళిద్దరూ ఏదో దాస్తున్నారన్న విషయం స్పష్టంగా గోర్కీకి అర్థమయింది. చిన్న చిరునవ్వు పెదాలమీద మెరిసింది.

"ఎందుకు నవ్వుతున్నావూ?" ఆశ్చర్యంగా అడిగాడు స్టిట్సన్.

"చర్చించడానికి ఏం పెద్ద సమాచారం వుందని మనం యీ రహస్య స్థావరంలో కలిశాం? లోకానికి అంతటికీ తెలిసిన  విషయాల్నేగా మనమూ చర్చించుకుంటున్నదీ. ఫ్రెండ్స్ ఏదేమైనా మళ్ళీ మళ్ళీ కలుద్దాం. చర్చించే విషయం వున్నా లేకపోయినా" అన్నాడు గోర్కీ.

"అలా ఎందుకూ?" షాన్‌తో అన్నాడు స్టిట్సన్.

"చాలా ఏళ్ళ క్రితం నిజంగా జరిగిన సంఘటన చెబుతాను. మా ప్రధాని చైనా ఏలికని కలిశారు. ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ప్రపంచం ఎంత సంతోషించిందంటే, రెండు అతి పెద్ద దేశాలు యీనాటినించీ శాంతిని సుస్థిరం చేసి ప్రపంచ దేశాలకి మార్గదర్శనం చేస్తాయని . అంతేకాదు" ఆగాడు గోర్కీ. బాటిల్‌లోనించి ఓ గుక్క  నీరు కూడా తాగాడు.

"ఇంకా?" కుతూహలంగా అడిగాడు స్టిట్సన్.

"హిందీ చీనీ భాయీ భాయీ ' అనే నిందాదం కూడా వారిద్దరూ కలివిడిగా ఇచ్చారు. అంటే  భారత దేశమూ చైనా సోదర దేశాలని" మళ్ళీ ఆగాడు గోర్కీ.

"దెన్" అసహనంగా అన్నాడు స్టిట్సన్.

"వారంలోపే చైనా భారత దేశం మీద దండెత్తి వెన్నుపోటు పొడిచింది. పొరుగుదేశాన్ని అమాయకంగా నమ్మినందుకు భారతదేశం చాలా చాలా చాలా మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది అప్పుడు లెక్కలేనంత భూభాగాన్ని ఆక్రమించుకున్న చైనా ఇప్పటికీ ఆ భూభాగాన్ని వదలకుండా భారత్‌ని ముప్పతిప్పలుగా పెడుతూనే ఉంది. సో బ్రదర్స్..

చర్చల వల్ల ఫలితాలు ఇలానూ ఉంటాయి. అంటే నమ్మించి గొంతు కోసే విధంగానూ వుంటాయి. కొన్ని చర్చలు నమ్మికతో, విశాల హృదయంతో, విశ్వశాంతి నెలకొనాలనే కోర్కెలతో చేస్తే అద్భుతమైన సత్ఫలితాలూ ఇస్తాయి. అయినా బ్రదర్స్, మానవాళికై మనం పనిచేటప్పుడు మనదేశపు రక్షణనీ దృష్టిలో వుంచుకోవడం తప్పు కాదుగా? తెలియాల్సిన సమాచారం ఎప్పటికైనా తెలుస్తుంది. తెలియకూడదని అనుకున్నప్పుడు ఆ సమాచారం భూమియొక్క లోపలి పొరల్లో పూడ్చి బెట్టబడుతుంది. ఓకె. మళ్ళీ కలుద్దాం. మళ్ళీ మళ్ళీ కలుద్దాం" అంటూ లేచాడు గోర్కీ.

ఈ సమాధానాన్ని వాళ్ళిద్దరూ ఊహించనే లేదని వారి మొహాలే చెప్పాయి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments